## కొబ్బరికాయల మాటున..గంజాయి సరఫరా

- రూ.75లక్షల విలువ చేసే 250కిలోల గంజాయి పట్టివేత
- ఇద్దరు నిందితులు అరెస్టు



సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : ఒడిశా కేంద్రంగా కొబ్బరికాయల మాటున నగరంతో పాటు ఇతర రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.75లక్షల విలువ చేసే 250కిలోల గంజాయి, రవాణాకు వినియోగించిన కంటైనర్ సహా మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాచకొండ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ డీఎస్.చౌహాన్ కేసు పూర్వాపరాలను వెల్లడించారు. తమిళనాడుకు చెందిన మలయ్‌లి స్వామి అలియాస్ శివ ఉపాధి కోసం తన కుటుంబంతో కలిసి కొంత కాలం కిందట నగరానికి వలస వచ్చి చాంద్రాయణగుట్టలో స్థిరపడ్డాడు. స్నాక్స్ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న స్వామి వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో గంజాయి వ్యాపారంతో అధిక డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో నాలుగు నెలల కిందట తమిళనాడు నుంచి రామర్ అనే వ్యక్తిని నగరానికి రప్పించాడు. తన మేనమామ రాజా స్టాలిన్ ద్వారా కేరళా రాష్ట్రానికి చెందిన రాజేశ్‌తో పరిచయం ఏర్పర్చుకున్న స్వామి తన అనుచరుడైన రామర్‌తో కలిసి గంజాయి రవాణా చేయడానికి అంగీకరించాడు. ఒక్కో ట్రిప్పు రవాణాకు రూ.1.5లక్షలు కమీషన్ ఇస్తానని రాజేశ్ హామీ ఇచ్చాడు. ఈ క్రమంలో ఒడిషా నుంచి చంద్రశేఖర్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేస్తూ నగరంతో పాటు మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, శ్రీలంక తదితర ప్రాంతాలకు మలయ్‌లి స్వామి, రామర్‌లు గంజాయి రవాణా చేస్తున్నారు. అయితే ఒడిషాలోని చంద్రశేఖర్ వద్ద ఈనెల 24న 250కిలోల గంజాయి కొనుగోలు చేసి ఎవరికీ అనుమానం రాకుండా కొబ్బరికాయల కింద గంజాయి బస్తాలను దాచిపెట్టి, నగరానికి తీసుకువచ్చారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు మీర్‌పేట్ పోలీసులతో కలిసి చాంద్రాయణగుట్ట వద్ద నిందితులు ప్రయాణిస్తున్న కంటైనర్‌ను ఆపి తనిఖీ చేశారు. కంటైనర్‌లోని కొబ్బరికాయల కింద గంజాయి బస్తాలు బయటపడడంతో పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.75లక్షల విలువచేసే 250కిలోల గంజాయితో పాటు రవాణాకు వినియోగించిన కంటైనర్ వాహనం, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాగా డ్రగ్స్ విక్రయదారులే కాకుండా వినియోగదారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగానే ఈ సంవత్సరం 100మందికి పైగా మత్తు పదార్థాలు తీసుకునే వినియోగదారులను అరెస్టు చేశామని, ఒక్క సెప్టెంబర్ నెలలోనే 17మంది వినియోగదారులను అరెస్టు చేసినట్లు సీపీ వెల్లడించారు. రాచకొండ పోలీసు కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు, ఎల్బీనగర్–మహేశ్వర్ జోన్ ఎస్ఓటీ డీసీపీ మురళీధర్ పర్యవేక్షణలో మీర్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రధానిది పాలనా పైశాచికం

### సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : పక్కనే ఉన్న కర్ణాటక, ఏపీ నీటి పారుదల ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇచ్చిన మోదీ సర్కార్.. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకపోవడం పాలనా పైశాచికమేనని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ విమర్శించారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు పాలమూరు జిల్లాను ఆనాటి పాలకులు వంచిస్తే, పాలమూరును ఒడ్డుకు చేరుస్తున్న సీఎం కేసీఆర్‌కు అడ్డుపడుతున్న మోదీ.. వర్తమాన విద్రోహిగా దాపురించాడని ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలో 2014 నాటికి 2 లక్షల ఎకరాలకు నీరందలేదని, పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వం దాదాపు 16 లక్షల ఎకరాల్లో రెండు పంటలకు సాగు నీరు పారిస్తున్న సత్యాన్ని నరేంద్ర మోదీ అధ్యయనం చేసి గుజరాత్‌లో అమలు చేయాలని సూచించారు. పాలమూరును అహంకారంతో కాకుండా పర్యాటక నయనాలతో చూస్తే, ఆయనకు పచ్చబడ్డ పాలమూరు అనేక పాఠాలు నేర్పుతుందన్నారు. పాలమూరులో ప్రధాని పర్యటనను ఉమ్మడి జిల్లా ప్రజలెవరూ పట్టించుకోవడమే లేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదాతో పాటు, కృష్ణ నీటి కేటాయింపుల వాటాను తేల్చకుండా పాలమూరులో పర్యటిస్తున్న మోదీ ది ముస్సోలినీ పర్యటనలా ఉందని ఆంజనేయ గౌడ్ విమర్శించారు.

## కారు మరమ్మతులో నిర్లక్ష్యం

### వోక్స్‌వ్యాగన్ సంస్థకు రూ.15వేలు జరిమానా

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): కారును మరమ్మతు చేసివ్వడంలో నిర్లక్ష్యం వహించిన వోక్స్‌వ్యాగన్ సక్సెస్ ఆటోమొబైల్స్ వినియోగదారుడికి రూ.15వేలు నష్టపరిహారం చెల్లించాలని హైదరాబాద్ వినియోగదారుల కమిషన్–1 ఆదేశించింది. కోర్టు ఖర్చుల కింద రూ.5వేలు అందజేయాలని పేర్కొన్నది. బంజారాహిల్స్‌కు చెందిన గోపాల్ శర్మ తన వ్యాపార కార్యకలాపాల నిమిత్తం మధ్యప్రదేశ్‌లోని వోక్స్‌వ్యాగన్ సక్సెస్ ఆటోమొబైల్స్ నుంచి అమియో టీడీఐ కారును కొనుగోలు చేశాడు. ప్రమాదంలో కారు పాడవ్వడంతో అదే షోరూంలో మరమ్మతు కోసం ఇచ్చాడు. మరమ్మతు ఇన్‌టైంలో చేసివ్వడంలో సంస్థ విఫలమైంది. కారు లేకపోవడంతో తన బిజినెస్‌లో తీవ్రంగా నష్టపోయానని ఇందుకు తనకు న్యాయం చేయాలని వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కేసును కమిషన్ అధ్యక్షురాలు బి.ఉమావెంకట సుబ్బలక్ష్మి, సభ్యులు సి.లక్ష్మీప్రసన్న, ఆర్.నారాయణరెడ్డిలతో కూడిన బెంచ్ విచారించింది. వినియోగదారుడికి నష్టపరిహారం చెల్లించాల్సిందిగా పేర్కొన్నది.

# నేడు మిలాద్-ఉన్-నబీ ర్యాలీ




మిలాద్–ఉన్–నబీ బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్

- నగరంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా చర్యలు
- రౌడీషీటర్ల కదలికలపై, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా
- వీడియో కాన్ఫరెన్స్‌లో నగర సీపీ సీవీ.ఆనంద్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : 'మిలాద్–ఉన్–నబీ' ర్యాలీ ఆదివారం నిర్వహించనున్న సందర్భంగా నగరంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్ తెలిపారు. శనివారం మిలాద్–ఉన్–నబీ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై అన్ని జోనల్ పరిధిలోని సెక్టార్ ఎస్ఐలతో పాటు ఉన్నతస్థాయి అధికారులతో సీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ ఆనంద్ పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ర్యాలీ నిర్వహించే మార్గాల్లో ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు రోజుల కిందట శాంతియుత వాతావరణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గణేశ్ నిమజ్జనం కార్యక్రమంలో పోలీసులు సక్సెస్ అయ్యారని, అదే స్ఫూర్తితో మిలాద్–ఉన్–నబీ ర్యాలీలను కూడా శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు కృషిచేయాలన్నారు. ర్యాలీలు నిర్వహించే నిర్వాహకులతో సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ర్యాలీ తీసే మార్గాలను ముందుగానే తెలుసుకొని, ఆ మార్గాల్లో సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వెళ్లే యువత పట్ల ట్రాఫిక్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు భద్రతను పాటించేలా, ప్రమాదాలు జరగకుండా వారికి సూచనలు చేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ఏడు జోన్లలో రెండుకంటే ఎక్కువ ర్యాలీలు

మిలాద్–ఉన్–నబీ ఉత్సవాల చారిత్రక ప్రాధాన్యత, దానికి సంబంధిత సమావేశాలు, వార్షిక ఆచారాలపై నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కొత్త ఎస్‌హెచ్‌ఓలు, డీసీపీలకు సమగ్ర సమాచారాన్ని అందించాలని దక్షిణ మండలం డీసీపీని సీపీ ఆదేశించారు. ఈ సందర్భంగా అన్ని జోన్ల డీసీపీలు తమ జోన్ల పరిధిలో తీసే ర్యాలీల వివరాలను సీపీకి వివరించారు. సౌత్, సౌత్–ఈస్ట్, సౌత్–వెస్ట్ తదితర 7జోన్‌లలో గరిష్ఠంగా రెండు కంటే ఎక్కువ సంఖ్యలో ర్యాలీలు తీస్తున్నారని వివరించారు.

### గుల్జార్‌హౌజ్ నుంచి ప్రధాన ఊరేగింపు మొదలు

పాతబస్తీలోని గుల్జార్‌హౌజ్ నుంచి ప్రధాన ఊరేగింపు మొదలై పత్తర్‌ఘట్టి, మదినా క్రాస్‌రోడ్, చత్తబజార్, పురాని హవేలి, మిరాలం మండి, ఇత్తెబర్ చౌక్, కోట్ల అలిజ తదితర ప్రాంతాల మీదుగా సాగుతూ మొగల్‌పురాకు చేరుకుంటుందని డీసీపీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. అనంతరం అదనపు సీపీ(శాంతి భద్రతలు) విక్రమ్‌సింగ్ మాన్, అదనపు సీపీ(ఎస్‌బీ) విశ్వప్రసాద్‌లు గతంలో జరిగిన ఘటనలపై చర్చించారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన ముందుజాగ్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించడం, నేర చరిత్ర కలిగిన రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టడం, సోషల్ మీడియాపై నిఘా పెట్టడం తదితర భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులను సూక్ష్మంగా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

# కిడ్నాపైన బాలుడు దొరికాడు

- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో బాలుడిని కిడ్నాప్ చేసిన యాచక ముఠా
- శనివారం ఆచూకీ లభ్యం.. బాలుడు క్షేమం పోలీసుల అదుపులో ఇద్దరు యాచకులు
- నిందితులను పట్టించిన లగేజీ బ్యాగ్, సెల్ ఫోన్



పోలీసుల అదుపులో ఉన్న కిడ్నాపర్లు ఖలీవలి విక్రమ్, షెక్ రెహానా

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 30 : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కిడ్నాప్‌కు గురైన ఐదు ఏళ్ల బాలుడిని కిడ్నాపర్ల నుంచి రైల్వే పోలీసులు రక్షించారు. బెగ్గింగ్ మాఫియాలో ఉండి సహజీవనం చేస్తున్న ఓ జంటను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం రాయలపురం గ్రామానికి చెందిన దుర్గేశ్ తన ఐదేళ్ల కుమారుడు శివసాయి (మూగ, చెవిటి)తో కలిసి తిరుపతికి వెళ్లాడు. ఈ నెల 29న శుక్రవారం తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నం.1కి చేరుకున్నాడు. బాలుడు శివసాయిని లగేజీ బ్యాగ్ వద్ద ఉంచిన తండ్రి దుర్గేశ్ వాష్ రూంకు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి శివసాయి కనిపించలేదు. వెంటనే సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్రమత్తమైన రైల్వే పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. సీసీ కెమెరా ఫుటేజీల ద్వారా కిడ్నాపర్లను గుర్తించిన పోలీసులు శనివారం విడుదల చేశారు.

### సెల్ ఫోన్ ద్వారా.. బాలుడి ఆచూకీ లభ్యం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కిడ్నాప్‌కు గురైన బాలుడు శివసాయితో పాటు దుర్గేశ్ లగేజీ బ్యాగ్‌ను కిడ్నాపర్లు వెంట తీసుకొని వెళ్లారు. అయితే దర్గేశ్ సెల్‌ఫోన్ బ్యాగులోనే ఉండిపోయింది. దీంతో రైల్వే పోలీసులు సెల్ ఫోన్ టవర్ లోకేషన్ ఆధారంగా మాదాపూర్‌లోని సైబర్ టవర్స్ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. రైల్వే పోలీసులు ప్రత్యేక బృందాలుగా విడిపోయి పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. సైబర్ టవర్స్ ప్రాంతంలో ఓ బ్రిడ్జి కింద చెట్ల పొదల్లో ఉన్న బాలుడిని పోలీసులు చేరదీసి చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు.

### టివోలీ ప్రాంతంలో అదుపులోకి..

మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన ఖలీవలి విక్రమ్(41) భార్యా పిల్లలతో కలిసి బషీర్‌బాగ్‌లో నివాసముంటూ జేబీఎస్ ప్రాంతంలోని ఓ హోటల్‌లో పని చేస్తుండగా విజయవాడ ప్రాంతానికి చెందిన యాచకురాలు షేక్ రెహానా(25) విక్రమ్‌తో సహజీవనం చేస్తూ మాదాపూర్ పరిసర ప్రాంతాల్లో ఉంటున్నారు. వీరిని టివోలీ ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

### అక్టోబర్ 30న..

## నగరంలో పెయింట్ ద సిటీ పింక్ క్యాంపెయిన్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ) : రొమ్ము క్యాన్సర్ నివారణ, నియంత్రణపై నగరంలో అట్టహాసంగా మాసోత్సవాలను నిర్వహించనున్నట్లుగా ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డా.పి.రఘురాం తెలిపారు. అవగాహన మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని చారిత్రత్మక కట్టడాలు, నిర్మాణాలు, అరుదైన విగ్రహాలకు అక్టోబర్ 30న గులాబీ రంగు లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లుగా వివరించారు. గడిచిన 15ఏళ్లుగా నగరంలో పింక్ సిటీ క్యాంపెయిన్ నిర్వహిస్తూ బ్రెస్ట్ క్యాన్సర్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నట్లుగా పేర్కొన్నారు. క్యాన్సర్ నిర్ధారణ, అవగాహనతోపాటు బాధితుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు ఈ అవగాహన కార్యక్రమం సహకరిస్తుందన్నారు. ఈ క్రమంలో నగరంలో నిర్వహిస్తున్న పెయింట్ ద సిటీ పింక్ ప్రచారంలో భాగంగా చార్మినార్, బుద్ధ విగ్రహం, టీ హబ్, ప్రసాద్ ఐమ్యాక్స్, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, కిమ్స్ హాస్పిటల్‌తోపాటు, రాజ్ భవన్ వద్ద పింక్ లైటింగ్ వెలిగించనున్నారు. అంతర్జాతీయ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంలో భాగంగా ఈ నెల మొత్తం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

## సైబర్ సెక్యూరిటీ రంగంలో పుష్కలంగా ఉపాధి అవకాశాలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని యూనివర్సిటీ సైబర్ సెక్యూరిటీ కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఆయన శనివారం జేఎన్‌టీయూలో సైబర్ సెక్యూరిటీ ఫోరెన్సిక్ నాలుగు వారాల ఆన్‌లైన్ ఇంటెర్న్‌షిప్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ గోవర్దన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్, హెచ్‌వోడీలు తదితరులు పాల్గొన్నారు.